క్లుప్తంగా

తక్షణ సాయం అందజేత


నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: జె.డి.పేటలో మట్టా శ్రీనివాస రావు కుటుంబాన్ని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం పరామర్శించారు. శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య మల్లేశ్వరికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ వుతాయని తెలిపారు. సర్పంచ్ కోసిరెడ్డి కృష్ణ మూర్తి, పంచాయతీ కార్యదర్శి వెత్సా రమేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు


మాట్లాడుతున్న ఏపీఎం వెంకటలక్ష్మి

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు విడుదల చేస్తారని, ఆ వెంటనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని వెలుగు ఏపీఎం పి.వెంకటలక్ష్మి తెలిపారు. చౌడువాడ, లంకవానిపాలెం గ్రామాల్లో గురువారం వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో 1,401 సంఘాల్లో 14,978 సభ్యులకు 1.93 కోట్లు జమ కానున్నట్లు తెలిపారు. సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతంనాయుడు, సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

సర్వే రాళ్లు సిద్ధం


సర్వేరాళ్లు పరిశీలిస్తున్న తహసీల్దార్

రోలుగుంట: సమగ్ర భూసర్వేలో భాగంగా తొలి విడతలో సర్వే పూర్తయిన భూముల హద్దుల్లో పాతేందుకు సర్వేరాళ్లు సిద్ధంగా ఉన్నాయిని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. తన కార్యాలయ ఆవరణలో వాహనం నుంచి దింపిన సర్వేరాళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆయా భూముల్లో వీటిని పాతిస్తామని వివరించారు.

రోగులకు ఆరోగ్య సూచనలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య సూచనలను ప్రజలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా గురువారం ఎ.భీమవరంలో వైద్య సేవలందించారు. 134 మందికి ఓపీ వైద్యంతోపాటు మందులు ఇచ్చారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలతోపాటు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాము, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


మాకవరపాలెంలో విద్యార్థుల మానవహారం

మాకవరపాలెం: క్షయ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జాన్సన్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


మాట్లాడుతున్న ఏపీఎం మర్రి లక్ష్మి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శ్రీదేవి


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి


మాట్లాడుతున్న సర్పంచ్ సంధ్య

దేవరాపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల్లో సైతం రక్తహీనతను నివారించవచ్చునని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. కె.కోటపాడు సెక్టార్ ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మెయిన్ ఎంపీపీ స్కూల్‌లో 'పోషణ పక్వాడా' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా లభించే అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలతో అంగన్‌వాడీ సిబ్బంది తయారీ చేసిన వివిధ ఆహార పదార్థాలను స్టాళ్లలో ప్రదర్శించారు. వీటిని ఎంపీపీతోపాటు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, సీడీపీవో రుచి చూశారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. రాములమ్మ, సచివాలయ సెక్రటరీ రత్నం, ఏఎన్ఎంలు జయసుధ, హైమా, మహిళ సంరక్షణ కార్యదర్శులు జి. వరలక్ష్మి, ఎస్.కె. మీరాబి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కె.జె.పురంలో పోషణ పక్వాడా

మాడుగుల రూరల్: పోషణ పక్వాడా- మిషన్ 12లో భాగంగా నిర్వహిస్తున్న పక్షోత్సవాలు గురువారం కె.జె.పురం హైస్కూలులో మాడుగుల ఐసీడీఎస్ పీవో సిహెచ్. శ్రీదేవి ప్రారంభించారు. వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించే ఈ పక్షోత్సవాలు సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు రక్తహీనత బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్‌బీ 12 గ్రామాలకు తక్కువ ఉండకుండా ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కె.జె.పురం, ఎం. కోటపాడు, ఎం.కె.వల్లాపురం, వంటర్లపాలెం, ముకుందపురం, గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణి, చిన్నమ్మలు, ఏఎన్ఎం శ్రావణి, మహిళా పోలీసులు, ఆశ కార్యకర్తలు, వెలుగు వీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: చిరుధాన్యాల ద్వారానే సూక్ష్మ పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ పీవో శ్రీదేవి తెలిపారు. గురువారం గడబూరు ప్రాథమిక పాఠశాలలో బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న అనుబంధ పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యకర్త టి. అప్పలనర్సమ్మ, జి. దేవి, కొండాజీ ఎం. సరోజిని పాల్గొన్నారు.

నాతవరం: రక్తహీనత నివారణపై మహిళల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరాపై వివరించారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో 1,321 గ్రూపుల్లో 14,421 మందికి 9 కోట్లు 49 లక్షల 21 వేల 759 రూపాయలు విడుదల కానుందన్నారు. ఈ మొత్తాన్ని ఈ నెల 25న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. 26 నుంచి పది రోజులు పాటు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు, వెలుగు సీఏలు వాసు, మణిరాజు, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత, సత్యవతి, రాజేశ్వరి, వరలక్ష్మి, మణి పాల్గొన్నారు.

రోలుగుంట: ప్రభుత్వం సమకూర్చిన వైఎస్సార్ కిట్లను గర్భిణులకు, బాలింతలకు అందించి వారిలో రక్తహీనతను నివారించాలని నిండుగొండ సర్పంచ్ శెట్టి సంధ్య తెలిపారు. నిండుగొండలో పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అపరంజని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. వైఎస్సార్ కిట్లలో ఖర్జూరం, బెల్లం, చెక్కిలు తదితర వాటిని అందిస్తున్నామన్నారు. విటమిన్లు పుష్కలంగా ఉండే తోటకూర, బచ్చలి తదితర ఆకుకూరలతోపాటు, గుడ్డు, పాలు, చిరుధాన్యాలు వాడితే రక్తం వృద్ధి చెంది ఆరోగ్యంగా ఉంటారన్నారు. వెలుగు ఏపీఎం సాధన, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మతల్లి తీర్థం


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు


అమ్మవారి గుడికి వెళుతున్న భక్తులు

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి తీర్థం గురువారం ప్రారంభమైంది. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. వేకువజాము నుంచే అమ్మవారిని భక్తులు దర్శించుకోవడం కోసం క్యూ కట్టారు. గొలుగొండ, నర్సీపట్నం, కొయ్యూరు, చింతపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున వీరు తరలివచ్చారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖ, ఆలయ కమిటీ, పోలీసులు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.

ఘనంగా ముత్యమాంబ తీర్థం

చోడవరం రూరల్: గజపతినగరం గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలతో గ్రామస్తులు విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ నేతృత్వంలో సాయంత్రం గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలైన జాకీలకు వరుసగా రూ.12, రూ.10, రూ. 8, రూ.6, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు. గుర్రపు పోటీలకు జనం హాజరై ఉత్సాహంగా తిలకించారు.

సందడిగా వాసవీ క్లబ్ వార్షిక వేడుకలు


నాగజ్యోతిని సన్మానిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

రావికమతం: కొత్తకోట వాసవీ వనిత క్లబ్ వార్షిక వేడుకలు గురువారం సందడిగా జరిగాయి. ఈ క్లబ్ ఏటా వేలాది రూపాయల సేవా కార్యక్రమాలతో మండలంలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. పేద పిల్లలకు విద్యా మెటీరియల్ అందిస్తుంటోంది. ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించుకుంది. వాసవీ వనిత క్లబ్ ఏర్పాటు చేయడమేగాక సొంత నిధులతో సైతం పలు సేవా కార్యక్రమాలు చేసిన క్లబ్ మాజీ అధ్యక్షురాలు పి.వి.ఎం నాగజ్యోతిని ఈ సందర్భంగా సభ్యులు ఘనంగా సన్మానించారు.

వారపు సంత వేలం రూ.8.56 లక్షలకు ఖరారు


వేలం నిర్వహిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి తదితరులు

మాడుగుల: స్థానిక వారపు సంత వేలం పాట రూ.8,56,500కు ఖరారైంది. ఎంపీడీవో మీనాకుమారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ప్రభుత్వ పాటగా రూ.8.55 లక్షలకు నిర్ణయించగా, మాడుగులకు చెందిన పాతాళ చిన్నారావు 8 లక్షల 56 వేల 500 రూపాయలకు పాడి దక్కించుకున్నారు. గతేడాది రూ.7.90 లక్షలకు వేలం కాగా, ఈ ఏడాది 10 శాతం పెరిగిందని ఎంపీడీవో తెలిపారు. పంచాయతీకి సంబంధించిన 30 షాపులను ఈ దఫా ఏటా రూ.4.20 లక్షలకు అద్దె నిర్ణయించామన్నారు. వీటి ద్వారా పది శాతం ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్. నాయుడు, వార్డు మెంబరు జవ్వాది వరహాలు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సమ్మంగి జగన్, సయ్యపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీరోడ్డు నిర్మాణ పనులు


దేవరాపల్లిలో సీసీరోడ్డు పనులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని వనదేవీశ్వర ఆలయం వద్ద నుంచి కొరుపోలు వారి వీధికి సీసీరోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఇక్కడ మట్టిరోడ్డు ఉండటంతో వర్షాకాలంలో బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఆయన స్పందించి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 300 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ మండల ఇంజినీర్ ఉమామహేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడికి, ఎంపీపీ రాజేశ్వరికి స్థానిక కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా వెంకటరమణ


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

దేవరాపల్లి: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక దేవరాపల్లిలో గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా రైవాడ ఎంపీయూపీ స్కూల్ టీచర్ జి. శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన పెద్దాడ వెంకటరమణ, సహ అధ్యక్షుడిగా ఆర్‌వై. దొరను ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా ఎస్. పాపమ్మ, జనరల్ సెక్రటరీగా ఎం. ప్రకాష్‌బాబు, కోశాధికారిగా కె.వి.రమణమూర్తి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.కృష్ణ, జిల్లా కౌన్సిలర్లుగా వి. నాగేశ్వరరావు, ఎం. శేఖర్‌రావు, ఐ. శ్రీకృష్ణ ఎన్నికయ్యారు. వీరంతా ప్రమాణం స్వీకారం చేశారు. మండలాధ్యక్షుడు వెంకటరమణను సభ్యులంతా అభినందించారు.

వైఎస్సార్ ఆసరాతో స్వావలంబన



ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

మాడుగుల రూరల్: వైఎస్సార్ ఆసరాతో మహిళలు స్వావలంబన సాధించాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం వి.వి.అగ్రహారంలో వైఎస్సార్ ఆసరా మూడో విడతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. సచివాలయ పరిధిలోని రెండు గ్రామాఖ్య సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీటి పరిధిలోని 73 సంఘాలకు రూ.1.16 కోట్ల ఆసరా సొమ్ము సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. అనంతరం చిరుధాన్యాలు, వాటి ఉపయోగాలు గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, సీసీవోలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులకే 'ఉపాధి'


మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: మండలంలో జాబ్ కార్డుదారులకు విధిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతపై క్షేత్ర స్థాయిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. నూతన భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంత వేలం రూ.2.63 లక్షలకు ఖరారు

మాకవరపాలెం: సంత వేలం రూ.2.63 లక్షలకు ఖరారైంది. ప్రతి మంగళవారం జరిగే స్థానిక వారపు సంతలో ఆశీలు వసూలు చేసేందుకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో వివిధ ప్రాంతాల నుంచి వేలంపాటదారులు పాల్గొన్నారు. ఇందులో తాళ్లపాలెం గ్రామానికి చెందిన గల్లా కన్నాజీ రూ.2.63 లక్షలకు వేలం దక్కించుకున్నట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. గతేడాది రూ.2.53 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

ఒడ్డుకు చేరుతున్న మినప పంట

మాడుగుల రూరల్: అకాల వర్షాలతో చేతికంది వచ్చిన పంట పొలంలోనే పూర్తిగా తడిసి ముద్దయింది. దాంతో నీటిలో మునిగిన మినప పంటను రైతులు ఒడ్డుకు చేర్చి రోడ్ల మీద ఆరబెడుతున్నారు. పిల్లి పెసర, జనుము పంట దెబ్బతింది. మండలంలో 50 శాతం మేర జనుము పంట పూర్తిగా నేలకొరిగింది.

అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు సీఎం ఆదేశం

- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్


రోడ్డు విస్తరణ అంశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం/గొలుగొండ: గొలుగొండ మండలం అరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి నిధులు మంజూరుకు అధికారులను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గురువారం బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సీఎంను ఆయన కలిశారు. రోడ్డు విస్తరణలో అటవీశాఖ కోల్పోతున్న భూమికి బదులుగా వేరే ప్రాంతంలో ఐదెకరాల భూమి అప్పగించారన్నారు. ఆ భూమిలో అటవీ వనాల అభివృద్ధికి అటవీ శాఖకు నిధులు కేటాయించకపోవటం వల్ల రోడ్డు విస్తరణ కాలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దానిపై సీఎం వెంటనే స్పందిస్తూ రూ.45.80 లక్షలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చొరవతో కొన్నేళ్ల నాటి రోడ్డుకు మోక్షం లభిస్తుందన్నారు. త్వరలోనే పనులు మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల చిరకాల కల నెరవేరుతున్నందున నియోజకవర్గ ప్రజల తరుపున సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రూ.64 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు


పనులను పర్యవేక్షిస్తున్న జేఈ

కె.కోటపాడు: పిండ్రంగిలో రూ.64 లక్షలతో జలజీవన్ మిషన్ పనులను నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత తెలిపారు. ఇక్కడ 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంక్ శ్లాబ్ నిర్మాణ పనులను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన నిధులతో గ్రామంలో 478 ఇళ్లకు కుళాయిల నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. అదనపు మంచినీటి పథకం ట్యాంకు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంకు సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి కృతజ్ఞతలు తెలిపారు.

సీతారామాలయ వార్షిక కల్యాణోత్సంపై సమీక్ష


సమావేశమైన కార్యనిర్వహణాధికారి మరళీకృష్ణ

రోలుగుంట: స్థానిక సీతారామాలయాన్ని దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.వి.ఎస్.ఎస్. మరళీకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకుడు రేజేటి సీతారామాచార్యులతో ఆలయ నిర్వహణపై ఆరా తీశారు. ఈ నెల 30 నుంచి నిర్వహించే కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో సమీక్షించారు. ఈ ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భక్తి పారాయణం, ఆశావహులతో జానపద, సాంఘిక నృత్య కార్యక్రమాలు నిర్వహించి ఆలయంలో భక్తి వాతావారణం స్ఫురించేలా చేయాలని నిర్ణయించారు. ఉత్సవ నిర్వహణ కోసం దేవస్థాన నిధుల నుంచి రూ.15 వేలు మంజూరు చేయనున్నట్టు ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వివరించారు. ధర్మకర్తల మండలి సభ్యులు గొర్లె పైడియ్యానాయుడు, అల్లు ఎర్రినాయుడు, మద్దు రమణమ్మ, పూడి రాజులమ్మ పాల్గొన్నారు.

రీసర్వే పూర్తి చేయడమే ధ్యేయం


తహసీల్దార్ కనకరావు

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న రీసర్వే నిబంధనల ప్రకారం పూర్తి చేయడమే ధ్యేయమని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. గురువారం ఆయన వీఆర్వోలతో సమీక్షించారు. మండలంలోని 38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే చేయగా, సాంకేతిక సమస్యలతో సరుగుడు రెవెన్యూ గ్రామంలో నిలిపివేశామన్నారు. మొదటి ఫేజ్‌లో చొల్లంగిపాలెం కృష్ణాపురం అగ్రహారం, వి.శరభవరం, పొట్టి నాగన్నదొరపాలెం, రెండో విడతలో డొంకాడ అగ్రహారం, కొవడటిపూడి అగ్రహారం, శరభవరం అగ్రహారం రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. మిగతా రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే మ్యాప్‌లు వచ్చాక రీసర్వే ప్రారంభిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయినిబాబు

కె.కోటపాడు: స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ పాత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గండి నాయినిబాబు తెలిపారు. గురువారం సూర్రెడ్డిపాలెంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సాధనలో భగత్‌సింగ్ వీరోచితంగా పోరాడి తన ప్రాణాలను లెక్క చేయలేదని నాయినిబాబు తెలిపారు. ఏమి కావాలని బ్రిటిష్ వారు కోరితే దేశం వదిలి వెళ్లాలని చెప్పిన ధైర్యశాలి భగత్‌సింగ్ అని కొనియాడారు. నాయకులు యర్రా దేముడు, రొంగలి ముత్యాలనాయుడు, నాయుడు బాబు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై గ్రామైక్య సంఘాలకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఏపీఎం ప్రభాకర్

దేవరాపల్లి: పొదుపు సంఘాలు పేద కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతున్నాయని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఏపీఎం ఎస్. ప్రభాకర్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు)లో విజన్ బిల్డింగ్‌పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల ద్వారా 23 ఏళ్లలో సాధించిన లాభాలు, ఆర్థికంగా బలపడిన కుటుంబాల గురించి గ్రామైక్య సంఘాల అధ్యక్షురాళ్లకు అవగాహన కల్పించారు. అనంతరం అధిక పోషకాలు కలిగిన చిరుధాన్యాలు సాగుపై దృష్టి సారించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సీసీలు, అకౌంటెంట్ దేవి, ఉమా ప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు హేయం

నర్సీపట్నం: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపు మేరకు ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో సేవ్ జర్నలిజం డే నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు, బహుముఖ ప్రజ్ఞాశాలి షహీద్ భగత్‌సింగ్ వర్ధంతిని సేవ్ జర్నలిజం డేగా నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి యూనియన్ నాయకుడు సిహెచ్.బిఎల్.స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా స్టేట్ జనరల్ సెక్రటరీ పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని పలు సమస్యలపై కార్యాలయ ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సకిరెడ్డి నానాజీ, బేరా చినబాబు పాల్గొన్నారు.